


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

"**ఏనుగు లాంటి** వాళ్ళు ఆమె వైపు, నా వేపు కూడా ఉన్నారు కానీ ఎలుగు లాంటి వాళ్ళు నాకు గుర్తున్నంతలో లేరు ఆమె వైపు, నా వైపు కూడా లేరు. ఎవరో తెలిసిన వాళ్ళయుంటారు. ఆఫీసు వాళ్ళు కూడా కావచ్చు."

"మీ ఊహ సరైనదేనని నేనూ అనుకుంటున్నా. అది పెద్ద విషయం కాదు. మరిచిపోండి. వెన్నుపోటు పొడిచినపుడు ఆ వెన్నుపోటు వెనకాల గల కారణాలను సరిగ్గా ఊహించగల మేధే కాక, ఆ తప్పును సహృదయంతో క్షమించెయ్యగల విశాల హృదయం మీకు ఇవ్వబడిందని నాకు అనిపిస్తోంది. నా ఈ ఊహ తప్పు కాకుండా ఉంటే ఎంతో సంతోషిస్తాను. ఎందుకని? మీరు ఆ ప్రశ్న వేయకుండానే సమాధానం ఇస్తున్నాను: మీరు నా స్నేహితుడు కనుక. స్నేహం అవడానికి శతాబ్దకాలం అవసరం లేదు; అప్పివ్వాల్సిన అవసరం అంతకన్నా లేదు. "

ఆ మాటలలో ఏదో అసహజత్వం అతనికి తోచింది. కృపాకూ అలా తోచి ఉండవచ్చని అనంతానికీ అనిపించింది.

"మీరూ, నేనూ కూడా ఊహించలేని అతి స్వల్ప విషయం, అతి పెద్ద పారభౌతిక విషయమూ కలవని నాకు అప్పుడప్పుడూ అనిపించి రాత్రిపూట కనీసం ఒక గంట నిద్రపోకుండా నా పరుపు మీద దొర్లుతుంటా ఉపశమనం గురించీ," గంభీరంగా అన్నాడు అనంతం,

"అంత చిన్న విషయం చెప్పడానికి అంతటి గాంభీర్యతను, తాత్త్వికతను ధ్వనించడం, వైరాగ్యం చిందించడం అవసరమా?" నవ్వుతూ అన్నాడు కృపా, మనసులో నలుసంత ఆందోళన పుట్టినా.

"పేదతనంలో మగ్గిన వాడి ఆలోచనా విధానం ఇలానే ఉంటుందనుకుంటా. చీమను చూసి పాము అనుకునే భయాందోళనలు మనసంతా నిండి, తొణికిసలాడుతూ. పామును చూసినా చీమగా భావించే స్థైర్యం మీలో ఉందా?"

"పాము నాకు ఎపుడూ ఎదురై ప్రశ్నించలేదు; భయపెట్టలేదు," స్వరం స్వల్పంగా కంపిస్తుండగా అన్నాడు కృపా.

కృపా మేధ పదునైనదే. అనంతం దేన్నో చూసి, సహేతుకంగా అనుమానించి అతి తెలివిగా తనకు చేరవేశాడా? ఆధారరహితంగా, కేవలం తనకు అనుమానాన్ని కలిగించడానికి ఆ విషయాన్ని చెప్పాడా? దానివలన అతనికి ఒరిగేదేముంది? తాను తేలికగా ఆ విషయాన్ని తేల్చుకోవచ్చు అని అతనికి తెలియదా. అతనూ ఆ విషయానికి ప్రాధాన్యత ఇవ్వకుండా, యథాలాపంగా అని ఉండవచ్చు. అనుమానం నిప్పురవ్వ లాంటిది. తేల్చేసుకుంటే పోతుంది. అది సులభకార్యమే.

"అనంతం గారూ, నిజంగానే మీ కాలికి దెబ్బతగిలిందా?"

"అంత చిన్న విషయంలో అబద్ధానికి ఒడికట్టే బడి బాలకుడినా, నీచుడినా? నాకు కలిసొచ్చేదేముంది ఆ కారణంగా? ఆట స్థలం నుంచీ నన్ను ఇంటికి దిగపెట్టటానికి అబద్ధం ఆడొచ్చేమో!"

"నేను మిమ్మల్ని మీ గదికి దిగబెట్టటం వలెనే అనేక విషయాల మీద చర్చోపచర్చలకు వీలయింది. పెద్ద విషయం కాదన్నట్టు కనీసం ఒక విషయం నాకు తెలియనిది తెలియడం జరిగింది."

ఏమిటది అని అడగ దలచలేదు అనంతం. తను చెప్పదలచుకున్నది చెప్పేసిన తరువాత దాన్ని కొనసాగించడం శ్రేయస్కరం కాదు. కృపా కుర్చీ లోనుంచీ లేచి, వస్తానని శీతలంగా చెప్పి. బండి వైపు నడిచాడు. అనంతానికి భయం వేసింది. వ్యవహారం చెడిపోయి కృపాతో సంబంధం తెగిపోతుందేమో అన్నశంకతో. తన భార్య గురించీ అనంతం అన్న విషయం రెండు విధాలా మనసులో ముల్లులా గుచ్చుకోడం ఆరంభించింది కృపకు. ఆమె గురించిన చెడ్డ విషయాన్ని ఎత్తిపొడుపుగా చెప్పడం ఒకటైతే; నిజంగానే ఎవరో అజ్ఞాత వ్యక్తితో కలిసి బీచిరోడ్డున నడుస్తున్నాదా అన్న విషయం రెండవది. ఆమెను ఎవరు కలిసినా, ఆమె ఏ చిన్న పని చేసినా భర్తకు చెప్పకుండా ఉండదు.

అనుమానపు చిచ్చు రగిలించాడు అనంతం. దాన్ని కృపా తప్పక తీర్చుకోడానికి ప్రయతిస్తాడు. అది నిజం అని తేలుతుంది. ఆ విషయం తాను అతని చెవికి చేర్చాడు కనుక తన దగ్గిరకి వచ్చి బాధను వ్యక్తం చెయ్య వచ్చు; తన సలహా అడగవచ్చు. లేదంటే భార్యతో గొడవపడొచ్చు. ఏమి జరుగుతుందో చూడాలి. ఆ విషయం తను కృపకు చేరవేశాడని ఆమెతో చెబితే ఆమె అనంతం మొహం ఇక చూడదు. జరగబోయే సంఘటనల ఆధారంగా తను తన పథకాన్ని ఆలోచించ వచ్చు. వ్యాపారంలో రిస్కు తీసుకోడం తప్పనిసరి. ఆ పనే చేశాడు. తను తన గోరునన్నా ఉపయోగించకుండా ఏదో జరగాలని ఎదురుచూసే వీలు అతనికి లేదు.

కృపా తీవ్రమైన ఆలోచనకు, ఆవేదనకు గురయ్యాడు. ఎవరో పరిచయస్థుడితో సుప్రభాత వేళ సముద్రపు అంచున నడిచినంత మాత్రాన దాన్ని లైంగిక సంబంధంగా లెక్కవేయడం సంకుచితత్వం క్రిందికి వస్తుంది. అతనితో కలిసి నడిచినట్టు లేక రోజూ నడుస్తున్నట్టు తనకు చెప్పుంటే దాన్ని మామూలు విషయంగా పరిగణించ వచ్చు. అందులో కావాలని ఆమె దాపరికాన్ని అవలంభించిందా, సాధారణ విషయంగా భావించిందా అన్నది తెలియదు. ఆమె అతి చిన్న

విషయాన్ని పడుకున్నప్పుడు ఏకరువు పెడుతుంది ఛాతీని తన చేత్తో రాస్తూ. అలా రాయడం కృపాకూ, రాసె ఆమెకూ కూడా ఎంతో హాయినిస్తుంది. 'భార్యతో జీవిస్తే ఇలా రాయించుకుంటూ బతకాలి,' అని తల ఎత్తి ఆమె తేనె సోనలను నోటితో అందుకునేవాడు. అమృతమయ సంసారం విషతుల్యంగా మారడానికి నలుసంత విషం చాలు. వాళ్ళిద్దరి సముద్రపు అంచు కలయికను అనంతం ఇంద్రియాలకు తాను గ్రహించలేని విషయాలను తెలియజేసిందా? వాడి గ్రహింపు నిక్కమా? వేరే మనిషి ఇంద్రియాల మీద కాక తన ఇంద్రియాల మీద ఆధారపడటం విజ్ఞుడైన వ్యక్తి చేసే పని. వాళ్ళిద్దరి కలియక కేవలం ఒక రోజుకు పరిమితమయుంటే రేపు అది ఉండకపోవచ్చు. ఇక సమస్యేముంటుంది? కృపకు తాను తన భార్య సముద్రానికి అనుదినం వెళుతుందని చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. అలా చెప్పిన మరుసటి రోజు అక్కడ ఏదో జరుగుతుందనే, ఆమెనే కలుద్దామనో అనంతం వెళ్లాడా, ఏమిటి? అనంతం విషయం ప్రస్తుతం అప్రధానం. తన జీవితానికి సంబంధించిన ఒక అనుమానాన్ని తొలగించుకోవడం తన సంసారానికి శ్రేయస్కరం, తాను ప్రశాంతంగా జీవించడానికి పరమ అవసరం.

ఇంట్లోకి అడుగుపెడుతుండగా సుమతి మధురమైన కూనిరాగా వినిపిస్తోంది. ఎవరో వీణ తీగలు మీటుతున్నట్టుంది. ఆమె ముఖంలోకి చూస్తే కడిగి టాల్కమ్ పొడి అద్దిన చంద్రబింబంలా ఉంది. ఏ మచ్చాలేదు దాని మీద, పెదవి క్రిందున్న అందమైన పుట్టు మచ్చను మినహాయించి. దాన్ని తన నాలుక కొసతో తాకుతుంటాడు స్పర్శా సుఖాన్ని ఊహించుకుంటూ. కళంకం అంటని వ్యక్తికి దాన్ని అంటించడమూ శతకోటి ఆనందాలలో ఒకటేమో పరులకు.

"ఆలస్యం అయిందేమి, కృపా?"

సమాధానానికి ఎదురు చూడకుండా, వెళ్లి రెండు చిన్న వెండి గ్లాసులతో ఫిల్టర్ కాఫీ తెచ్చి ఒకటి అతనికిచ్చి రెండోది తన చేతిలో ఉంచుకుని అతని పక్కన ఆనుకుకుని సోఫాలో కూర్చుంది. అతను మౌనంగా తాగుతున్నాడు.

"బాగుంది కదూ?"

"ఎందుకు బాగుండదూ? ఎప్పుడు బాగాలేదని? నీ చేతి మహాత్మ్యం వలన విషమూ బావుంటుంది."

"అయితే అది కూడా అప్పుడప్పుడూ ఇస్తుండనా?" అతని కుడి తొడ మీద తన ఎడమ చేత్తో చరుస్తూ అనింది.

"అంతకన్నానా?"

"ఏమీ, జీవితం మీద విరక్తి కలిగిందా?"

"రక్తి, విరక్తికి ఒకే అక్షరం తేడా!"

"భావంలో అనంతమైన తేడా కలదు కదా, కృపా?"

అతను లేచి స్నానం చెయ్యడానికి వెళ్ళిపోయాడు.

తెల్లవారుతుండగా సుమతి వాక్కు వెళ్ళడానికి తయారవుతూ చేసే శబ్దాలు వింటూ కళ్ళుమూసుకుని ఉన్నాడు కృపా. ఆమె చంకలకూ, మొహానికి పోసుకుంటున్న టాల్కమ్ పౌడర్ సువాసన ఎందుకో వెగటు వాసన కొడుతోంది

అతనికి ఎప్పుడూ లేనిదీ. ఎప్పుడూ ఆ వాసనకు ఆమె పెదవుల మీద ముద్దాడాలనిపించేది. మంచం మీద పడుకుని ఉండటంలో కొంత సుఖం ఉంది. ఆమె పడక గదిలో నుంచీ వెళ్లిపోయింది తలుపు దగ్గిరగా వేసి. బైట వరండా గ్రిల్లుకు తాళం వేయడం వినిపిస్తోంది. తరువాత స్కూటరు స్టార్టు చేసిన శబ్దం. అతను దుప్పటి తన్నివేసి లేచిపోయి చిలక్కొయ్యకున్న దుస్తులు వేసుకుని తన స్కూటర్ మీద బీచికి బయలుదేరాడు. దూరంగా ఆమె నెమ్మదిగా స్కూటర్ నడుపుతూ ఎప్పటిచోట ఆపి ఎదురుచూస్తోంది ఎవరి గురించో. దూరంగా ఆమె తల తిప్పి చూసినా కనబడకుండా తన బండిని ఆపి ఆమె తనకు కనబడే చోట నిలబడ్డాడు. ఆమె ఎదురు చూసిన వ్యక్తి నడిచి వచ్చి ఆమెను చేరంగానే ఇరువురూ నడవటం మొదలుపెట్టారు. ఆ వ్యక్తిని ఒకసారి కృపా చూసివున్నాడు. వెనకనే తానూ నడవటం మొదలుపెట్టాడు. వాళ్ళు భుజాలు భుజాలు రాచుకుంటూ నడవటం కృపకు నచ్చలేదు. వాడు నడుస్తూ ఆమె వెనుక భాగానికి తన చేతిని తాకించడం కృపాను బాధించింది. ఇసుకలోకి వెళ్లి నిలబడి కనబడిన మేరకు చూశాడు. ఇరవై నిముషాలు అలా నిలబడి ఉండగా వాళ్లిద్దరూ అటు నుంచీ నడిచి రావడం కనిపించింది. చెమటలు పోసిన శరీరానికి చల్లగా తేమగా సముద్రపు గాలి తగులుతోంది. ఎందుకో ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వడం లేదది. మనసుకు గాలి సోకదు. ఆమె అతి వేగంగాను, అతను రొప్పుతూనూ నడుస్తున్నారు. పర్వతాకాయుడు రొప్పక తప్పదు శ్రమ పడితే. పెరిగే కాయాన్ని అదుపు చేయడానికి అతను వృథా శ్రమకు పూనుకున్నట్టున్నాడు. ఆమెతో కలిసి నడిచి ఆనందించడానికి కూడా అతను నడక మార్గాన్ని ఎన్నుకునుండ వచ్చు. నడుస్తూ నడుస్తూ అతను నోరంతా బావురుకప్పలా తెరిచి నవ్వుతున్నాడు చేస్తున్న తప్పుడు పనికి ఏడవడానికి బదులు; ఎవరు ఏమి మాట్లాడారో తెలియదు. నిజానికి దగాకు గురైన తాను ఏడవాలి; ఏడుస్తున్నాడు – నోటితో కాకపోయినా మనసుతో. కృపాను చూసి అతను నవ్వుతున్నట్టు కృపకు అనిపించింది. సిగ్గు, అవమానాలు కెరటాలలా ఎగిశాయి. లేచి, పరుగు తీసి వాళ్ళను చేరి ఆ వ్యక్తిని గొంతు పిసికి చంపాలనుంది. కృపా తన అశక్తతకు విచారించాడు. వాడు తనను ఎడమచేతితో పీక పిసికి చంపగలిగేట్టున్నాడు. ఎవరన్నా వాడికంటే బలవంతుడి సహాయం సముద్రపు ఒడ్డున దొరకనందుకు విచారం వేసింది. అనంతం గుర్తుకొచ్చాడు. అతను తన పక్కనుంటే ఓదార్పుగా ఉంటుందనిపించింది. నిద్రపోతుంటాడు; రాత్రి నా మనసులో చిచ్చుపెట్టి. అలా అతను తనకు చెప్పడం మంచిదా, చెడ్డదా? తెలియకుండా ఏ రంకు జరిగినా మేలా, తెలిసీ ఏమి చెయ్యలేకుండా అశక్తంగా ఉన్నపుడు జరగటం మేలా అని అడిగితే మొదటి ప్రశ్నకు అవునని, రెండో దానికి కాదని ఏ చచ్చు వెధవైనా గాఢ నిద్రలో కూడా సమాధానం ఇవ్వగలడు. అనంతాన్ని ప్రస్తుతానికి తన శ్రేయోభిలాషిలా పరిగణించడం తన అవసరం కూడా. ఏ గాడిదన్నా తన ముందుకొచ్చి నీకు నాకు చేతనయినా సహాయం చేయగలను కావాలా? అంటే ఐదింటికీ నమస్కరించడానికి వెనుదీయడు. అనంతం అన్నట్టు సంసారులకూ నిద్రపట్టని సంగతులుంటాయి. అతని శరీరం తనకు సాయం చేయలేకపోయినా ఈ సమస్యకు ఏదన్నా పరిష్కారం చూపించడంలో సాయం చేయగల సమర్థుడు. స్త్రీ పురుషుల రంకుదనానికి భాష్యం చెబుతున్నట్టు వాళ్ళు నడిచి వెళుతున్నారు. తన భార్యకు తాను ఏమి లోటు చేశాడో అతనికి అర్థం కాలేదు. వాడి పెళ్ళాన్ని నేను కామించి బీచ్ రోడ్డులో

ఉదయాన్నే నడుస్తుంటే చూడటానికి వాడికి ఎలా ఉంటుందో కనీసం ఊహించుకోలేని మృగమా వాడు? అగ్నిసాక్షిగా ఒక శాల్తీని మనువా డానన్నస్పృహ లేని ఇల్లాలా, వెలయాలా సుమతి? కడుపునిండుగా భోంచేసినా తిండి కంటపడితే మింగే రకాలు ఎంతో మంది. తన భార్య మణిపూస అని గర్వపడేవాడు. ఈ పనికి ఎందుకు ఒడికట్టింది?

కృపా వెనుదిరిగి తన బైకు ఎక్కి గాలిలో బండిని నడుపుతున్నట్టు నడిపి ఇంటి తలుపులు తీసి, తిరిగి తాళం కప్పలు వేసి మంచం మీద బోర్లా పడుకున్నాడు. పరుపు పై కన్నీరు ఒలికింది. తాను సముద్రంలో మునగాల్సింది. ఇంటికొచ్చాడంటే బతుకు మీద మమకారం చావకనా, చావలేకనా? ఆమె ఒచ్చేసింది. చెమటతో కలిసిన టాల్కమ్ పౌడి మదం వాసనను వెద జల్లుతోంది. ఆ వాసన తనకు ప్రతి రోజూ పరిచితమే. అప్పుడు ఇబ్బందిపెట్టనిది ఇప్పుడు వెక్కిరిస్తోంది, సవాలు విసురుతోంది.

"ఇక లేవచ్చుగా నిద్ర," అనింది.

"ఎప్పుడో లేచాను," అన్నాడు వెల్లకిలా పడుకుని.

ఆమెను చూస్తుంటే ఆ విచారంలోనూ కోర్కె వీచిక లేచి తల వాల్చింది ఎవరో మందలించినట్టు.

నక్కలా పొంచి అంతా గమనించిన అనంతం కృపా తన భార్యను దొంగతనంగా చూసి బహుశా విలపిస్తుండటం, చిచ్చుపెట్టిన వాడు గమనించి జారుకున్నట్టు – అనంతం సంతోషంగా తన గదివైపు నృత్యం చేస్తున్నట్టు నడవటం మొదలుపెట్టాడు. అతని ఉత్కంఠ వేధించడం మొదలుపెట్టింది. భార్యాభర్తలు ఆ విషయం మీద కీచులాడుకుని ఆమె ఉద్రేకంతో పంకాకు ఉరేసుకోదు కదా అన్న అనుమానం వచ్చింది అనంతానికి. కృపా కూడా ఆపని చేసే అవకావం లేకపోలేదు. ఆమె మరణిస్తే తనకు నష్టం అనిపించింది. కొన్ని పథకాలు బెడిసికొడతాయి. పథకం వేసేటప్పుడే దానికి మానసికంగా సిద్ధపడుండాలి. తదనంతర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పథకానికి కొనసాగింపుగా మరొక దాన్ని ఆలోచించిపెట్టుకోవాలి. అలాంటి అవకాశాలు పూజ్యం అయినపుడు విధిపై బరువేసి ఊరుకోడం తప్ప చేయగలిగింది ఏమీ లేదు. ఇపుడు తాను ఆశిస్తున్నది మంత్రసానిత్వం. అందులో సానిత్వం ఉంది. ఈ సానిత్వానికి పురుషత్వం ఉంది. ఒక వేళ తన కృషి ఫలించకపోతే సబ్బునీళ్లతో చేతులు కడిగేసుకుంటే పోతుంది విచారిస్తూ. తాను పూనుకున్నది పెట్టుబడి లేని వ్యాపారానికి. నిజానికి తన రూపమే పెట్టుబడి అవుతుందేమో. చిచ్చు పెట్టిన తనకు ఆ చిచ్చు నుంచీ ఎలాంటి ప్రమాదం లేదు. గదిని చేరి పరుపు మీద పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు. మెదడు యంత్రం పని చేస్తోంది వేగంగా. ఆటకు వెళ్ళ దలచుకోలేదు ఈ సాయంత్రం. చేయవల్సినదల్లా కృపాగురించీ ఎదురు చూడటం. వస్తాడా, రాడా? త్వరగా గడవమని కాలాన్ని ప్రాధేయపడ్డాడు. అనంతం ప్రమేయం లేకుండా కృపా చేసుకోగల ఏర్పాట్లు ఏముంటాయో అనంతం మెదడుకు అందటం లేదు. మెదడు పనికీ పరిమితులుంటాయి.

సాయంత్రం రాత్రి ఒళ్ళో తలను వాల్చుతోంది. కృపా ఇన్ని గంటలపాటు కేవలం ఆలోచిస్తూ ప్రతిక్రియకు పూనుకోకుండా ఉండటం అసంభవం. ఎటూ తేల్చుకోలేక ఉండుండ వచ్చు హామ్లెట్టయ్యి. కృపా తన ప్రత్యర్థి ప్రాణాలకు

ముప్పు తెచ్చే ప్రయత్నంలో ఉన్నాడా? భార్యకే విషంపెట్టి చంపేస్తాడా? ఏదన్నా జరిగినా తన దాకా వార్త చేరితేనే కదా తనకు తెలియడానికి? ఎవరో వచ్చి వార్తను అతనికి చెప్పరు. వార్తా పత్రికకు ఎక్కవలసిన అంశం అయితే పత్రికలలో రేపుగాని రాదు.

భార్యను ఈ విషయంలో ఎలా నిలదీయాలి? నిలేస్తే, ఆ వ్యక్తంటే నాకిష్టం అని సమాధానం రావచ్చు. ఆ తరువాత తనముందున్న ప్రత్యామ్నాయం? వాళ్ళిద్దరి మధ్య ఉన్నది తామిద్దరి మధ్య ఉన్న సంబంధంకన్నా బలమైనది కావచ్చు. కొత్త ఒక మోజు, పాత రోత. 'సుమతీ, జరిగిందేదో జరిగిపోయింది, వాడితో నీ సంబంధాన్ని తెంపిపారెయ్యి; మునుపటిలా ఒకరికొకరం జీవిద్దాము,' అంటే వినేస్తుందన్న నమ్మకం కలగలేదు. ఎలాగూ వ్యవహారం బైటపడింది కనుక వాడితోనే సంసారం (దుకాణంలా) పెట్టుకోడానికి సిద్ధమైతే? వాళ్లద్దరి మధ్యా ఉన్న అక్రమ సంబంధాన్ని పట్టించుకోకుండా వదిలెయ్యడం ఒక ప్రత్యామ్నాయం. కానీ లోకమంతా కోళ్ళూ, కాకులై కొంతకాలం కూస్తాయి; తనను వెకిలిగా చూస్తాయి. భార్య మోసగొట్టుపని చేస్తే భర్తనూ శిలువ ఎక్కించడం ఏమిటో! గుండె నిబ్బరంతో, ఎవరి చూపులలోకీ తన చూపులు కలపకుండా, ఎవరూ చూస్తుండగా నవ్వడం మాని జీవించాలి. అలాంటి వంచన గుండెలో, మనసులో విరిగిన ముల్లులా వేధిస్తూనే ఉండేది; దానితో ఎలా రాజీపడటం గుండె, మనసు జడపదార్థంలా మారితే తప్ప? ఆమె చేసినపని నాకు తెలిసిపోయిన తరువాత ఆమెతో జీవనం కొనసాగించినంత మాత్రాన వంచన వంచన కాక పోదు. తనకు ఆ విషయం తెలిసి పోయిన తరువాత ఆమె విచ్చలవిడితనం అధికమవుతుంది; కాస్తన్నా మరుగును ఎరుగదు. అసలు ఆమె అంతలా ఎలా బరితెగించింది? తనంటే భయం లేకపోవచ్చు; లోకమంటే ఖాతరులేకుండా ఎలా ఆ పనిచేయగలిగింది? ఆ వెధవ దగ్గిరకు వెళ్లి 'మా సంసారం మమ్మల్ని చేసుకోనీరా, నీ పిండాకూడుపెట్టా,' అని కాళ్లావేళ్లా పడితే? అలా చెయ్యడానికి నా సిగ్గును చిదిమేయాలి. సిగ్గులేని జీవితం సుఖవంతం. ఈ సమస్య నన్ను ఆలోచించనీయడంలేదు; పరిష్కారం ఎలా కనుగొలను? మరొక బుర్ర సాయం అవసరం. ఈ విషయం తెలియని వాడి దగ్గిరకు వెళ్లి వాడితో ఈ అవమానాన్ని పంచుకుంటూ సలహా అడగడంకన్నా, ఇది తెలిసిన అనంతాన్ని సలహా అడిగితె?

“గత రెండు పూటలా సరిగా భోజనం చెయ్యలేదు. అజీర్తి చేసినట్టుంది ఆస్పత్రికి వెళదామా?" అడిగింది సుమతి.

"పిచ్చాస్పత్రి మెరుగు," అన్నాడు.

"పిచ్చిపట్టిందా?"

"ఇప్పుడే ఆస్పత్రికి వెళ్ళొస్తా," అని చెప్పి బండి మీద అనంతం గదిని చేరాడు.

గది ముందు చెప్పులు విడిచిన చప్పుడయింది. చెప్పులయితేనేమి గాని వాటి చప్పుడు అనంతానికి వీణానిక్వణంలా వినిపించి పరుపు మీద లేచి కూర్చున్నాడు. తన మనసుకు తాను మొట్టికాయ వేసి ఉద్రేకపడవద్దని హితవు పలికాడు. గదిలోకి కృపా అడుగుపెట్టాడు. అనంతం పరుపు మీదినుంచీ లేచి వెళ్లి ఉన్న కుర్చీని కాస్త ముందుకు లాగాడు.

"కూర్చోండి, కృపా గారు," అన్నాడు అతను సువార్త తెచ్చినట్టు.

అనంతం వెళ్లి పరుపు మీద పద్మాసనం వేసుకుని యోగముద్రలో కూర్చున్నాడు. మూర్తీభవించిన అమాయకచక్రవర్తిలా తోచాడు కృపారావుకు; ఇతను మాత్రం తనకేమి సహాయంచేయ్యగలడు? కాకపోతే ఆ పుర్రెలో తనకు ఉపయోగపడే ఆలోచన ఉండకూడదని లేదు.

"అనంతం గారూ, మీకు మొన్న నిజంగానే కాలినొప్పా? ఈ ప్రశ్న మళ్ళీ వేయాలనిలిపించి వేశా. ఇష్టంలేకపోతే సమాధానం ఇవ్వకండి."

"గడ్డం చేసుకున్నట్టు లేరు."

"మీ కాలునొప్పి ఒక నిజాన్ని నేను తెలుసుకోడానికి ఉపయోగపడింది; నొప్పి నిజమైనదా కానిదా అన్నది అనవసరం."

"నిజం చెడుదైనా తెలియడం ఒక్కొక్కసారి సహాయకారి కూడా; పరిష్కారానికి పూనుకో వచ్చు. పరిష్కరించలేకపోతే చేతులెత్తెయ్యవచ్చు రాజీపడి."

"నన్ను నొప్పించకుండా ఒక చెంప ప్రయత్నిస్తూ నిజాన్నితెలియజేయడం నాకు మీరు సహాయం చేసినట్టుగా భావిస్తున్నా."

"ధన్యవాదాలు. దాని వలన నాలో ఒక విశ్వాసం కలిగింది నా లాంటి పేదా ఏదో ఒక సహాయం చెయ్యడానికి వీలుందని. ఒక మిత్రుడిగా ఒకవేళ నా భార్య భవిష్యత్తులో అలాంటిపని చేస్తే, నేను చేసిన సహాయంలాంటిది మీరూ చెయ్యకపోరు. ఒకరికొకరం కనీసం ఇలాంటి సహాయాన్నన్నాచేసుకోకపోతే మనం అంగవైకల్యపు జీవితాలను ఈడ్చాలిసుంటుంది."

"కొందరి దురదృష్టవంతులైన వారి భార్యలే మోసానికి పూనుకుంటారు. మీకు అలాంటి కష్టం రాకూడదు."

“జీవితాలు ఎలా ముగుస్తాయో చెప్పలేము. అవి ఆంటీ అగాథ క్రిస్టీ అపరాధపరిశోధక నవలలు. ఒక వేళ కలగన్నా అది ఒక కల అని కొట్టిపారేస్తూ ఫిల్టర్ కాఫీ తాగుతాము. మాయాజాలంలో సాలెపురుగులా బందీ అయి కొట్టుమిట్టాడుతుంటాము. బందీ కాకపోయినా అలా అయినట్టు భ్రమిస్తాం. బాగా ఆలోచిస్తే స్వయంకృత అపరాధం ప్రముఖమైన పాత్రను మన జీవితాల్లో పోషిస్తుంది.ఎవరినీ తప్పుపట్టకు; నిష్పక్షపాతంగా ఆలోచిస్తే ఏ విషయంలోనైనా తప్పు నీది కాకుండాపోదు అని వివేకానందుడన్నట్టుఎక్కడో చదివాను. నేను బూతు పుస్తకాలతో సహా అన్ని పుస్తకాలూ చదువుతుంటాను. బూతువి అనుకున్నవాటిలో పిసరంత మంచి ఉండకపోదు; మంచివి అనుకున్నవాటిలో పిసరంత బూతు ఉండకపోదు.”

"మీరు ఇంత పిన్న వయసులో జీవితాన్ని ఇంత లోతుగా, విస్తీర్ణంగా అధ్యయనం చేయగలగడం అభినందనీయం. జీవితంలో ఎన్నో ఘనకార్యాలకు పురస్కారాలందవు."

"ఎవడు వాడూ?" కోపంగా అడిగాడు అనంతం మాట్లాడుతున్న విషయాన్ని దారిమళ్లిస్తూ.

పేరు, వివరాలూ చెప్పాడు కృపా. కళ్ళు చమ్మగిల్లాయి; ఉద్రేకపడ్డాడు.

“తమాయించుకోండి," ఆత్మీయంగా అన్నాడు, పరుపు మీది నుంచీ లేచి కుర్చీ దగ్గిరికి వచ్చి, అతనిని పక్కన నిలబడి, బతిమాలుకున్నట్టుగా భుజాలూ గడ్డం పట్టుకుని.

వెళ్లి కూజాలోనుంచీ గ్లాసులోకి నీరు ఒంపి, ఆప్యాయంగా తెచ్చి ఇచ్చాడు. కృపా కాదనకుండా తాగి ఖాళీ గ్లాసును కుర్చీ పక్కన ఉంచాడు.

"మనం మానవమాత్రులం కృపాగారు. మన ఆడవాళ్లందరినీ సీతలా ఉండాలని, మనమగవాళ్ళందరం రాముడిలా ఉండాలని అనుకోడం లేక శాసించడం అలవిగాని పని. ఇది ఆ కాలం కాదు; కలికాలం; పోయేకాలం. కాలానుగుణంగా మనుషులు పెడతోవలు పడతారా; వాళ్ళు పెడతోవలుపడటం వలన కాలానికి చెడ్డపేరు వస్తుందా అన్న విషయం పరిశోధించ వలసివుంది; అంటే అశాంతిని కోరి తెచ్చుకున్నట్టే. ఆమెను అగ్నిపరీక్షకు గురిచేయడం తగనిపని అని మీకు చెప్పడం మీ ఇంగిత జ్ఞానాన్ని ప్రశ్నించినట్టవుతుంది. మన పరిచయం స్నేహంగా రూపు దిద్దుకుంటున్న తరుణంలో మిమ్మల్ని తక్కువ అంచనా వేసి అవమానించడం అధర్మం. రాముడికాలంలోనే రాముడిలా ప్రజావాక్కుకు ప్రాధాన్యతివ్వడం శుద్ధ అవివేకం. లోకులు పలుగాకులు అని మీకూ తెలుసు. వాటిని తోలుతూ కూర్చుంటే మనం తిండికూడా తినలేము, కాలకృత్యంకూడా గావించలేము. ప్రజాభిప్రాయాలను వాక్కులను బేఖాతరుచెయ గలగడం ఒక విద్య. ఆమెను మీరు అరణ్యానికి పంపించగలరా? లేరు! ఉన్న ఒకే ఒక మార్గం విడాకులు. కొన్ని తప్పిదాలు చేసిందికదా అని యాభై ఎకరాల ఆస్తిపరురాలను కాలదన్నటం తెలివితక్కువదనం చిట్టాలో అగ్రశ్రేణిదవుతుంది. నేను అలా అన్నానుగదా అని నాపై కినుక వహించకండి; ఉన్నది ఉన్నట్టు మాట్లాడాలి స్నేహితులుగామారాలని వాంఛించే వ్యక్తులు. లేనిదీ ఉన్నట్టుగా శత్రువు మాట్లాడతాడు – ఆమెకు మీరు తగినవ్యక్తేనా? ఆమెకు మీతో కాపురం చేయడం ద్వారా మీకు ఆమె ఉపకారం చేస్తున్నట్టు, మీ పట్ల ఉదార స్వభావురాలై ఉన్నట్లు భావించవచ్చేమో! మీరు విడాకులు అన్నమాట ఆమె దగ్గిర అంటే మీరు ఆమెకు ఉపకారం చేయ పూనుకున్నట్టు ఆమె భావించే ప్రమాదం నిండుగా ఉంది. ఆమే మీకు ద్రోహం చేసిందని ఒకపక్క భావిస్తూ, ఆమెకు విడాకులివ్వడమనే ఉపకారాన్ని మీరు చేయడం సరైన నిర్ణయమేనా? అని మీకు అవుతున్నస్నేహితుడిగా నిలదియ్యదలచాను."

అనంతం మాటలు చురుక్కుమనిపించక పోవడం లేదు. జారిపడ్డవాడు లోకువకూడా అవుతాడు, జారిపడనివాడు ఇంతవరకూ పుట్టకపోయినా. కానీ ఇది నిగ్రహం ఎంతవరకూ వీలయితే అంతవరకూ వహించాల్సిన జీవిత సందర్భం. వీడి దగ్గిరమాత్రమే ఈ క్షణాన కాస్త ఓదార్పు పొందే వీలు కలదు. వీడిలో అపారమైన తెలివితేటల సంపద గనిలాటి మనసులో దాగి ఉందని అనుక్షణం తేటతెల్లమవుతోంది. డబ్బుకు ఠికానా లేని వాళ్లకు మేధా సంపత్తేలా? అని ప్రశ్నించడం కష్టం. ఇంతటి మేధా సంపత్తు ఉండీ డబ్బుకు ఠికాణాలేని వాడిగా ఎందుకు మిగిలున్నట్టు? అగ్నిగోళాల్లాంటి కనుగుడ్లతో అనంతాన్ని సూటిగా చూస్తున్నాడు కృపా. వేటగాడి బాణం ప్రాణం తీయకుండా బాధపడేంత గాయం చేసి ఊరుకున్నపుడు

విలవిలలాడే పక్షిలా కృపా విలవిలలాడటం గమనిస్తున్నాడు అనంతం. అది అతనికి ఆనందాన్నిస్తోంది; వేటగాడు పొందేలాంటిది. చేయబోయే సాయాన్నిబట్టి దానికి ధరకట్ట వచ్చు. వాదన ద్వారా తన మేధా శక్తి అసలు రూపాన్ని చూపుతున్నాడు. అది వీధికుక్కలా చెలరేగుతోంది.

"మేమిద్దరం విడిపోవడంకన్నావాళ్ళిద్దర్నీ విడదీసే మార్గం ఆలోచిస్తే పోతుంది," కృపా అన్నాడు.

"వాళ్ళిద్దర్నీ నిన్న చూసిన తరువాత అది సాధ్యపడే విషయంలా తోచడంలేదు, భాయ్ సాబ్. ఫెవికాలు ప్రకటనలో నటిస్తున్నవాళ్ళలానూ, నటిస్తూ జీవిస్తున్నవాళ్ళలానూ ఉన్నారు. ఇలా అన్నందుకు క్షమించండి. సుమతి గారంటే నాకు గౌరవం. ఆమెది చక్కటి పేరు."

కృపా కుర్చీలోనుంచీ కిందికి దొర్లుతాడేమో అనిపించింది. అలా అసాధ్యం అనడం డబ్బు సంపాదించుకునే ఒక అవకాశాన్ని నేలపాలుచేసినట్టే అని కూడా వెంటనే గుర్తుకొచ్చింది అనంతానికి.

"అసాధ్యం అన్న పదం నా పరిభాషలో లేదన్నాడు నెపోలియన్. వాటార్లూ బుద్ధి చెప్పింది; ఇది వేరే విషయం. ఇలాంటి సమస్యకు కూడా నా దగ్గిర పరిష్కార మార్గం లేదు అని ఈ సామాన్యుడు భావించడం లేదు," అనంతం అన్నాడు.

"మీరు నాలాంటి సంకట పరిస్థితిలో ఉంటే ఏమి చేసేవారు?"

"నేను ఉండను. వెర్రి ప్రేమకు, నిజానికి అసలు ప్రేమంటూ ఉంటె దానికీ కూడా నా స్వభావంలో స్థానం లేదు. అమ్మాయీ, నీ దారి నీవు చూసుకో అని కడుపులోనో కాస్త కిందనో ఒక తన్ను తన్ని, జుట్టుపట్టుకుని లం...అని ఉండేవాడినేమో నాకు తెలియదు. ముందుముందూ తెలిసే అనుభవం కలగకూడదని నన్ను నేను ప్రార్థిస్తున్నా. మిమ్మల్ని ప్రార్థించడానికీ నాకు అభ్యంతరం లేదు. ఎవరిని ప్రార్థించామా, ఎలా ప్రార్థించామా అన్నది అప్రధానం; పని జరగటం ప్రధానం."

పరుపు మీది నుంచి మరోసారి వచ్చి పరిచయం మొదలైననాటి నుంచీ ఇంతవరకు తీసుకొని చనువిప్పుడు తీసుకుని కృపా భుజం తట్టాడు, వీపు చరిచాడు అనంతం. మరో సందర్భంలో ఏమో కానీ ఇప్పుడు మాత్రం ఆ చనువు కృపకు ఊరటనిచ్చింది. కేవలం పరిచయస్థుడిలా కాక అనంతం ఆ క్షణాన రక్షకుడిలా తోచాడు. కేవలం పరిచయస్థుడైతే తన వేదనాభరిత క్షణాన తన భుజం ఇలా తడుతూ ఊరట ఇచ్చే బాధ్యతను ఎందుకు తీసుకుంటాడు? పైగా ఇంతవరకు, బేలగా, పేదగా తెలివితేటలూ అంతగా లేనట్లు కనిపిస్తూ వచ్చిన అనంతానికి ఈ అనంతానికి ఎంతో తేడా క్రమేపీ కనిపిస్తోంది; ఇంతవరకూ వామనుడుగా తోచిన అనంతం త్రివిక్రముడిగా మారి ఆకాశానికి ఒక కాలు ఎక్కుపెట్టినట్టనిపిస్తోంది. అతను అగ్నిలో దూకమన్నా దూకుదాం, అది ఏమి చెయ్యదు అనంతం చెప్పాడు కనుక అనిపిస్తోంది. సుమతిని ఒదులుకోలేడు. ఒకవేళ ఆ వ్యక్తిని ఈమె నుంచీ వేరు చేయలేకపోయినా సర్దుకుపో దలచుకున్నాడు. కానీ ఈ ఘాతం నుంచీ కోరుకోగలిగిన తరువాతే ఆమెతో ఆమెకుగల ప్రేమ, కామ సంబంధంతో

సర్దుకుపోవడం ఆరంభమవుతుంది. అనంతం అన్నట్లు తాను చేయగలిగిన ప్రయత్నం తానూ చేయ నిశ్చయించాడు. అందులో అనంతం చేయగలిగింది అనంతం చేత చేయిస్తాడు ప్రస్తుతానికి. కానీ అనంతం చెయ్యగలిగిందేముంది?

"నాకు ఒక ఆలోచన వచ్చింది. నేను మీకు సమాచారం ఇవ్వడమనే సాయం చేశా. పథకం వేయడానికి అదేదో మీకు చెప్పడానికీ ఇరవై నాలుగు గంటల సమయం (ఒక నిమిషం అటూ ఇటుగా) కావాలి. జీవితంలో కాలాన్ని సిగరెట్టుగానో, చుట్టగానో కాల్చి వినోదిస్తుంటాం; అందువల్ల ఇరవైనాలుగు గంటల గురించీ అధికంగా ఆలోచించక్కరలా. రేపు ఇదే సమయానికి కలుద్దాం. కాలానికి అనుగుణంగా ఆయా ధర్మాలుంటాయి. గత కాలపు అధర్మం నేటి ధర్మం. పాతివ్రత్యాన్ని మంటకలిపిన స్త్రీతో కాపురం ఏమిటీ అని బాధపడకండి. ఒక చెడ్డ పని చేసినంత మాత్రాన ఆ మనిషి విలువ కాస్త తగ్గవచ్చేమో గాని అస్సలు విలువ లేనిదిగా ఆ వ్యక్తి మారడం జరగదు."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS